# తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు గ్రీన్‌సిగ్నల్

- ఏఐఐబీ రుణంతో 70 శాతం నిధులు.
- 95 పాఠశాలలకు రూ.928 కోట్ల అంచనా.
- ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు ఒకే క్యాంపస్.




**దశ, హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (TPS) ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన టీపీఎస్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రారంభించారు. తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి అవసరమైన పరిపాలనా అనుమతుల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది.

మరో 95 టీపీఎస్‌ల నిర్మాణానికి సుమారు రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. భూమి విస్తీర్ణం, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి ఒక్కో పాఠశాలకు సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. నియోజకవర్గానికి ఒక టీపీఎస్ చొప్పున ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు.

95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌లకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

టీపీఎస్‌ల నిర్మాణానికి అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (AIIB) రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. విద్యారంగ మౌలిక వసతుల అభివృద్ధి కోసం AIIB, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రుణాలు సమీకరించే ప్రభుత్వ ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనున్నారు.

రుణం అందడంలో ఆలస్యం జరిగినా పనులు నిలిచిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. AIIB తరపున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ ప్రాజెక్టు అమలు, మౌలిక వసతులు, నిర్మాణ ప్రమాణాలపై అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన ఆధునిక విద్యా క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు.

ఆధునిక తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.

విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్‌తోపాటు పాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే అచ్చంపేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు రెండేసి టీపీఎస్‌లు మంజూరు కాగా, గజ్వేల్‌కు కూడా ఒక పాఠశాలను కేటాయించారు.


ఆరుట్లలో ప్రారంభమైన తొలి టీపీఎస్‌ను నమూనాగా తీసుకుని మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 100 టీపీఎస్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచి, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

## హైదరాబాద్ వాసికి మిసెస్ కాన్ఫిడెంట్ టైటిల్



**దశ, హైదరాబాద్:** నగరానికి కు చెందిన సిప్రా మల్లిక్, ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2026 సీజన్4 నేషనల్ ఫైనల్స్ లో ప్రతిష్ఠాత్మకమైన 'మిసెస్ కాన్ఫిడెంట్' టైటిల్ను కైవసం చేసుకున్నారు. గ్లామర్ గుర్గావ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో దేశం నలుమూలల నుంచి ప్రతిభావంతులైన వివాహిత మహిళలు పాలుపంచుకున్నారు. ఈ పోటీల్లో సిప్రా మల్లిక్ తన ఆత్మవిశ్వాసం, హుందాతనం, స్పష్టమైన భావవ్యక్తీకరణ, వ్యక్తిత్వం, కమ్యూనికేషన్ నైపుణ్యం, మేధస్సు, మాట్లాడే తీరు వంటి విభిన్న అంశాలపై న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకొని 'మిసెస్ కాన్ఫిడెంట్' టైటిల్ను సొంతం చేసుకున్నారు.

## సీజేఐ సూర్యకాంత్కు నల్సార్ విద్యార్థుల నో




**దశ, మేడ్చల్:** శామీర్పేటలోని నల్సార్ యూనివర్సిటీలో స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై 2026 బ్యాచ్ విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నీట్ నిరసనల సందర్భంగా సీజేఐ చేసిన వ్యాఖ్యలే తమ అభ్యంతరాలకు కారణమని విద్యార్థులు చెబుతున్నారు. సీజేఐని ముఖ్య అతిథిగా ఆహ్వానించే నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని జూలై 23న 2026 బ్యాచ్కు చెందిన సుమారు 70 మంది విద్యార్థులు నల్సార్ యాజమాన్యానికి లేఖ రాశారు. విద్యార్థుల అభ్యంతరాలకు ఇతర బ్యాచ్ల నుంచి కూడా మద్దతు లభించింది. 2027 నుంచి 2031 వరకు బ్యాచ్లకు చెందిన సుమారు 380 మంది విద్యార్థులు కూడా ఈ ప్రాతినిధ్యానికి మద్దతు తెలిపినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు యాజమాన్యం తమకు అధికారికంగా స్పందించలేదని విద్యార్థులు చెబుతున్నారు. తమ డిమాండ్పై సమాధానం రాకపోతే.. వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చి ఆందోళన చేపడతామని విద్యార్థులు స్పష్టం చేశారు. సీజేఐ ఆహ్వానంపై నల్సార్ యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## నాచారం ఓయూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

**దశ ఓయూ:** బదిలీపై వెళ్తున్న ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్‌ను, ఓయూ ఏసీబీ జగన్ తో కలిసి నాచారం ఓయూ ప్రెస్‌క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దాసు గణేష్, గౌరవ సలహాదారు నరసింహరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జస్ట్ డి రాజు, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు విశ్వం గౌడ్, ఫణింద్రచారి తదితరులు మహేష్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఓయూ పరిధిలో విధులు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన సేవలను వారు కొనియాడారు. బదిలీ అనంతరం కూడా ప్రజలకు, పోలీసు శాఖకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఫిరోజ్, సభ్యులు తిరుమల్ రెడ్డి, హరీష్,జీవన్ రెడ్డి, జాఫర్, విజయ్, వెంకట్, జీవన్, రవి, శ్రవణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి 'లయన్ క్వెస్ట్' శిక్షణ




- విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యం: జిల్లా గవర్నర్ కే.వి. ప్రసాద్

**దశ, నకిరేకల్:** ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్‌లు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా గవర్నర్ కే.వి. ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్, నవ్య, సెంటెనియల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో లయన్ క్వెస్ట్ ప్రోగ్రామ్ను ఈ నెల 9, 10 తేదీల్లో నకిరేకల్ పట్టణంలోని స్థానిక శాస్త్ర పాఠశాలలో నిర్వహించారు. నకిరేకల్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 30 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై రెండు రోజుల పాటు శిక్షణ అందించారు.

జిల్లా కోఆర్డినేటర్ కొండ సంతోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రోగ్రామ్ చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, కో చైర్మన్ లోకసాని సరితారెడ్డి ఆధ్వర్యం వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గవర్నర్ కే.వి. ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్‌లు అనేక గొప్ప సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో మల్టీపుల్ జీఎస్టీ, క్వెస్ట్ గ్రాంట్ కోఆర్డినేటర్ తీగల మోహన్‌రావు, పీజీడీ డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్1 కోడె సతీష్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్2 గూడిపూడి వెంకటేశ్వరరావు, లయన్ క్వెస్ట్ శిక్షకురాలు కొండపల్లి రేణుక, చార్టర్ ప్రెసిడెంట్ కందాల పాపిరెడ్డి, జోన్ చైర్మన్ సుధాకర్, సెంటెనియల్ చార్టర్ ప్రెసిడెంట్ యానాల రజనీకాంత్‌రెడ్డి, లయన్స్, నవ్య క్లబ్‌ల అధ్యక్షులు సూర్యచందర్‌రావు, పద్మజ, కార్యదర్శి అండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన ఉపాధ్యాయులకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాలల ప్రతినిధులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సైదాబాద్లో ఘనంగా బోనాల వేడుకలు

- భవిష్యవాణి వినిపించిన దేవనమ్మ




**దశ, హైదరాబాద్:** సైదాబాద్ డివిజన్ కరణ్బాగ్లోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఉప ఆలయమైన శ్రీ రేణుక ఎల్లమ్మ, మహంకాళి, పోచమ్మ అమ్మవార్ల దేవాలయంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారి ఆలయంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో దేవనమ్మ భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని ఆమె తెలిపారు. "నా భక్తులను అన్ని ఆపదల నుంచి కాపాడి, వారికి అండగా ఉంటాను. వివాహం, సంతానం కోసం పూజలు చేసే భక్తులను కరుణిస్తాను" అని దేవనమ్మ భవిష్యవాణి ద్వారా తెలిపారు. రంగం కార్యక్రమంలో అమ్మవారి భవిష్యవాణి వినేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆసక్తిగా విన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకురాలు అనురాధ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా మీలా మహదేవ్ ఏకగ్రీవ ఎన్నిక



**దశ సూర్యాపేట ప్రతినిధి :** లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం లయన్స్ ఐ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి మొరిశెట్టి లక్ష్మాధి, సహాయ ఎన్నికల అధికారులు యాద కిరణ్, గుడిపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. చైర్మన్‌గా మీలా మహదేవ్ పేరును దోసపాటి గోపాల్ ప్రతిపాదించగా, గుడిపూడి వెంకటేశ్వరరావు బలపరిచారు. దీంతో మీలా మహదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ హాజరై నూతన చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. లయన్స్ ఐ హాస్పిటల్ ద్వారా పేద ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు మరింత విస్తృతంగా అందించాలని వారు ఆకాంక్షించారు.నూతన కార్యవర్గం: కార్యదర్శిగా పెండెం చంద్రశేఖర్, కోశాధికారిగా చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తోట శ్యామ్‌ప్రసాద్, కక్కిరేణి చంద్రశేఖర్, పోలబోయిన నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా మిర్యాల సుధాకర్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా నూక వెంకటేశం గుప్తా, ఈగ దయాకర్, పటేల్ నరసింహారెడ్డి, భువనగిరి భాస్కర్, ఆరే సురేష్‌రెడ్డి, కుమ్మరికుంట్ల లింగయ్య, బెలిదే అంజయ్య, రామదుగు ధర్మారావు, చల్లా లక్ష్మీకాంత్, రాచకొండ శ్రీనివాస్, మట్టపల్లి రాధాకృష్ణ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ లయన్స్ ఐ హాస్పిటల్ అభివృద్ధికి, పేద ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రి సేవలను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

## మెడికో ప్రియాంక మృతి..



- నిందితులను కఠినంగా శిక్షించాలన్న తెలంగాణ ప్రభుత్వం

**దశ, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో గత వారం మాల్ వద్ద కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన తెలంగాణ మెడికో కె. ప్రియాంక (28) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఇవాళ పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, గాంధీ ఆసుపత్రికి వెళ్లి ప్రియాంక కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూసేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడతారని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, ఏక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ప్రియాంక, రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఎండీ చదువుతున్నారు. ఈ నెల 3వ తేదీ రాత్రి, తన స్నేహితుడు ఉమేశ్‌తో కలిసి స్కూటీపై మాల్ నుంచి బయటకు వస్తుండగా ఈ ఘోరం జరిగింది. మద్యం మత్తులో ఉన్న సురవరపు దశవంత్, ఆండ్రూ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు వ్యక్తులు మాల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో వారితో గొడవపడి, దాడి చేసి, అక్కడి నుంచి కారులో వేగంగా పారిపోయే ప్రయత్నంలో మాల్ గేటు వద్ద ఉన్న ప్రియాంక స్కూటీని మూడుసార్లు ఢీకొట్టారు.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రియాంకను మొదట స్థానిక ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమెను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించగా, నిన్న తుదిశ్వాస విడిచారు. ఆమె మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి, అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించనున్నారు.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ప్రియాంక కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు.మొదట నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రియాంక మరణంతో ఇప్పుడు ఆ సెక్షన్‌ను హత్యా నేరంగా మార్చే అవకాశం ఉంది. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ప్రియాంక తండ్రి వెంకటేశ్ రాజమహేంద్రవరంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడితే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని మంత్రి శ్రీహరి అభిప్రాయపడ్డారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు

## నాచారం అంబేద్కర్‌నగర్‌లో ఘనంగా అమ్మవారి పలారం బండి ఊరేగింపు



**దశ ఓయూ:** అంబేద్కర్‌నగర్‌లో అమ్మవారి పలారం బండి ఊరేగింపును సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలారం బండిని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ప్రభాకర్, అర్బన్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్‌రావు హాజరయ్యారు. టీఆర్ఎస్ పార్టీ నాచారం నాయకుడు మల్లికార్జున్‌గౌడ్, నవీన్‌కుమార్ గౌడెల్లి, రామకృష్ణ, రాగిరి మోహన్‌రెడ్డి, కొరపాక అంజి, ఏర్పుల నర్సింగ్‌రావు, గౌడెల్లి ప్రవీణ్, ఏర్పుల చిన్న సాయిబాబా, జి.బబ్లు, జి.రాకేష్, కె.విశాల్, బి.రాకేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు. యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపును విజయవంతం చేశారు.

## కాజీపేట దర్గాలో మత సామరస్య సందేశం

❖ వచ్చే ఉర్సుకల్లా అభివృద్ధి పనులు పూర్తి



**దశ, హైదరాబాద్:** కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి, ఉర్సు ఉత్సవాల ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు ఉత్సవాల్లో పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జరిగిన సభలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కులమత భేదాలు లేకుండా హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఉర్సు ఉత్సవాల్లో కలిసి పాల్గొనడం సర్వమత ఐక్యతకు నిదర్శనమన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, నిర్వాహకులను అభినందించారు. దర్గాకు వచ్చే జాయరీన్లకు అవసరమైన మౌలిక వసతులపై నిర్వాహకులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని మంత్రి తెలిపారు.

స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో సమన్వయం చేసుకుని దర్గా అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సమగ్రంగా సిద్ధం చేయాలని సూచించారు. కాజీపేట దర్గా సర్వమతాలకు సంబంధించిన ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వచ్చే ఉర్సు నాటికి అభివృద్ధి, మౌలిక వసతుల పనులు పూర్తి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ.. సమాజానికి ప్రేమ, ఆప్యాయత, ఐక్యత, సోదరభావం ఎంతో అవసరమన్నారు. కాజీపేట దర్గా ఉర్సులో తెలంగాణకు ప్రత్యేకమైన గంగా-జమునా తహజీబ్ కనిపిస్తోందని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అతిథులు పాల్గొనడం సంతోషకరమన్నారు మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. తెలంగాణ మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కాజీపేట దర్గా ఉర్సులో వందల ఏళ్లుగా కులమత భేదాలు లేకుండా ప్రజలు కలిసి పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హంధన్, తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా సాహెబ్, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన టేకు కలప స్వాధీనం



**దశ, హైదరాబాద్:** మండలంలోని కస్తూరీనగరం బీట్ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చుంచుబంధం తండాలో కలపను అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో సోమవారం అధికారులు తనిఖీలు చేపట్టారు.బయ్యారం ఫారెస్ట్ రేంజ్ అధికారి రవికిరణ్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది చుంచుబంధం తండాలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కలపను బయ్యారం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న టేకు కలప పరిమాణం 1.227 క్యూబిక్ మీటర్లు కాగా, దీని విలువ సుమారు రూ.76,079 ఉంటుందని ఎఫ్ఆర్ఓ రవికిరణ్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన అధికారులు స్వాధీనం చేసుకున్న కలపను ఇల్లందు ఫారెస్ట్ డిపోకు తరలించారు. అక్రమంగా కలపను నిల్వ చేయడం, రవాణా చేయడంపై దర్యాప్తు కొనసాగుతోందని అటవీశాఖ అధికారులు తెలిపారు. తనిఖీల్లో డీఆర్ఓలు, కస్తూరీనగరం బీట్ అధికారి, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాలు చెబితే ఊరుకునేది లేదు..

## నిజాలు మాట్లాడాలి, రాజకీయాలు చేయొద్దు: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి





❖ కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వితండవాదం

**దశ, హుజురాబాద్:** కమలాపూర్ మండలంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ సోమవారం రోజున కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతున్న సమయంలో రాజకీయ విమర్శలు, వాస్తవాలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడంపై హుజూరాబాద్ ఎమ్మెల్యే శ్రీ పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. "అబద్ధాలు చెప్పొద్దు.. నిజాలు మాట్లాడాలి. ఇది రాజకీయాలు చేయాల్సిన వేదిక కాదు. ప్రజలకు వాస్తవాలు చెప్పండి" అని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం కంటే, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్, రోడ్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందుకున్న లబ్ధిదారులకు ఇళ్లలో అవసరమైన చిన్నచిన్న పనులు చేసుకునేందుకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఇదే వేదిక నుంచి మంత్రులను ఎమ్మెల్యే కోరారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ఆడపిల్లల వివాహాలకు కళ్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, పెన్షన్ల పెంపు వంటి హామీలను ఏమయ్యాయని ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ ని వీణవంక మండలం లో చల్లూరు ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్నారు

### కమలాపూర్ బస్‌స్టాండ్‌కు రూ.2 కోట్లు కేటాయించాలి.

కేవలం ప్రారంభోత్సవాలు, రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా..కమలాపూర్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

## మతం మారితే హక్కులు మారకూడదు



*దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి.*

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు అందుతున్న రిజర్వేషన్లు, రాయితీలు, హక్కులను వర్తింపజేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బిషప్ సీహెచ్ సాల్మాన్‌రాజ్, పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ శాంసన్ మామిడి, పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎం. ప్రభుదాస్ డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం ఎక్స్‌రోడ్డు వద్ద బ్లాక్‌డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో అమలులోకి వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా మతం మారిన దళిత క్రైస్తవులు రాజ్యాంగపరంగా తమకు దక్కాల్సిన ఎస్సీ హోదా, రిజర్వేషన్లకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా సమాన హక్కులు కల్పించాలని కోరారు. మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక పరిస్థితులు మారవని, వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో వారికి రాజ్యాంగపరమైన రక్షణలు, హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక, ఆర్థిక రంగాల్లో దళిత క్రైస్తవులకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా పరిశీలించాలని కోరారు. గతంలో వివిధ ప్రభుత్వాలు, రాష్ట్ర అసెంబ్లీలు ఈ అంశంపై కేంద్రానికి సిఫార్సులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి బలమైన సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. తాము కూడా ఓటు హక్కు కలిగిన భారత పౌరులమని, తమ సమస్యను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



## 38 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**దశ, హైదరాబాద్:** అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో ఉన్న సుమారు 38 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, తరలింపునకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉండగా, వారి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో అనుమానాస్పదంగా వెళ్తున్న అశోక్ లేలాండ్ ఆటోను పోలీసులు తనిఖీ చేశారు.

వాహనంలో భారీగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పరిశీలించగా సుమారు 38 క్వింటాళ్ల బియ్యం బయటపడింది. దీంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు.ఈ వ్యవహారానికి సంబంధించి నాగరాజు, చంద్రశేఖర్, తరుణ్ అనే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బియ్యం అక్రమ రవాణాలో మరో ముగ్గురు వ్యక్తులు కూడా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

## ఆదివాసీ యోధుల్లారా పాట ఆవిష్కరణ

❖ హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడాలి



**దశ, ఓయూ:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో 'ఆదివాసీ యోధుల్లారా' పాటను సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. డీబీఎస్‌ఏ, భీమ్ డ్రమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నలిగంటి శరత్ చమార్ రచించి, గానం చేసిన ఈ పాటకు భరత్ మేకల సంగీతం అందించారు. డీఓపీ, ఎడిటింగ్ శ్రీకాంత్, పోస్టర్ డిజైన్ వర్షిత్ బమర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ నలిగంటి శరత్ చమార్ మాట్లాడుతూ.. ప్రకృతితో మమేకమై అడవులు, కొండలు, నదులను తమ జీవనంలో భాగంగా చేసుకొని శతాబ్దాలుగా ఆదివాసీలు జీవిస్తున్నారని అన్నారు. వారి జీవన విధానం కేవలం సంస్కృతి మాత్రమే కాదని.. ప్రకృతిని కాపాడే గొప్ప తత్వమని పేర్కొన్నారు. భూమి, అడవి, నీరు, హక్కులు, అస్తిత్వం కోసం అనేక మంది ఆదివాసీ యోధులు చేసిన పోరాటాలు, త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు.

'ఆదివాసీ యోధుల్లారా' పాట ద్వారా ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, ఆత్మగౌరవం, హక్కుల కోసం సాగిన పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ పాట ఆదివాసీ హక్కుల కోసం గొంతుకగా, వారి చరిత్రకు సాంస్కృతిక గుర్తింపుగా నిలవాలని ఆకాంక్షించారు. ఆదివాసీల హక్కులను కాపాడటం అంటే ప్రకృతిని కాపాడటమేనని, అడవులు, జల వనరులు, భూములు, ప్రకృతి సంపదతో పాటు రాజ్యాంగ హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఆదివాసీ చరిత్రను అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు.

ఓయూ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ సంస్కృతి, చరిత్ర, హక్కుల పరిరక్షణకు విద్యార్థులు, మేధావులు, కవులు, రచయితలు, సామాజిక ఉద్యమకారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం డాక్టర్ నలిగంటి శరత్ చమార్ 'ఆదివాసీ యోధుల్లారా' వంటి పాటను తీసుకురావడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆప్కా నాగేశ్వరరావు, సూర్యకిరణ్, డీబీఎస్‌ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ జంగిలి దర్శన్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్. మూర్తి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. కొమ్ము శేఖర్ మాదిగ, టీఎస్‌పీజాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. వాలిగొండ నరసింహ, ఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, డీబీఎస్‌ఏ రాష్ట్ర అధికార ప్రతినిధి కాసర్ల మధుసూదన్, డీబీఎస్‌ఏ ఆల్ యూనివర్సిటీస్ ఇన్‌చార్జి ప్రశాంత్ చిన్నా, బిక్కు మురళి, సంతోష్ ఇస్రం, అన్సర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ విద్యార్థులు, ఓయూ పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, కవులు, రచయితలు, సామాజిక ఉద్యమ నాయకులు హాజరయ్యారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర

❖ సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభం

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్రను సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమళ్ల రవికుమార్ తెలిపారు. సోమవారం హనుమకొండ కాకతీయ కాలనీలోని ఆయన నివాసంలో వేదిక అడహక్ కమిటీ సమావేశం నిర్వహించారు. వోడపెల్లి శ్యాం కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాత్ర నిర్వహణపై చర్చించారు.

వాస్తవానికి ఓదార్పు యాత్రను ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ, కమిటీ సభ్యుల సూచనలు, సలహాల మేరకు తేదీని సెప్టెంబర్ 17కు మార్చినట్లు రవికుమార్ తెలిపారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన రోజుగా సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యం ఉందని ఆయన పేర్కొన్నారు. నాటి హైదరాబాద్ సంస్థాన పరిధిలోని తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ రోజును వివిధ వర్గాలు విమోచన దినంగా గుర్తిస్తున్నాయని తెలిపారు.1969 తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్‌లో జరిగిన కాల్పుల్లో పలువురు ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోయారని రవికుమార్ పేర్కొన్నారు.

ఆ ఉద్యమకారుల స్మృతికి ఏర్పాటు చేసిన చిహ్నం వద్ద నుంచే ఓదార్పు యాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. యాత్రను విజయవంతం చేసేందుకు 20 మంది ఇన్‌చార్జిలను, జిల్లాల వారీగా మరో 10 మంది ఇన్‌చార్జిలను నియమించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యులు చాంద్ పాషా, ఎర్ర మనోహర్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.